



స్టేట్ ఎక్స్‌ప్రెస్ సిగరెట్ల టిన్నులా, జీడిపప్పులా, కూల్‌డ్రింకులా, తాండూర్ చికెన్లా. ఫైవ్ హోటల్లో డిన్నర్లూ, త్రీస్టార్ హోటల్‌లో లాడ్జింగ్ చార్జీలూ, రోజువారీ బత్తాలూ—ఓ! మై గాడ్! ఈ ఓచర్లూ, ఈ ఖర్చులూ చూస్తూంటే నా కళ్ళు తిరిగిపోతున్నాయి!

పబ్లిక్ రంగంలో ఉన్న ఒకానొక సంస్థలో నేనొక ఆడిట్ క్లర్క్‌ను.

మా సంస్థకు ఒక బోర్డు ఉంది. ఆ బోర్డులో కొంతమంది డైరక్టర్లు. వాళ్ళు వివిధ రంగాల్లోంచి వచ్చిన ప్రముఖులు. మా సంస్థ కార్యకలాపాలను సమీక్షించడానికీ, కొన్ని ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోవటానికీ ఈ బోర్డు అడపా దడపా సమావేశమవుతుంది. అలా సమావేశమైనప్పుడల్లా జరిగే ఖర్చుల తాలూకు ఓచర్లన్న మాట ఇవన్నీ! ప్రతి దఫా ఖర్చు నాలుగు అంకెల్లో దండిగానే ఉంటుంది. ఇవి కంటికి కనిపించే ఖర్చులు. కంటికి కనిపించని ఖర్చులూ, ఆరాలోకి రాని లెక్కలూ మరెన్నో!

వీళ్ళు వాళ్ళ వాళ్ళ ఊళ్ళల్లో ఉంటారు. ప్రతి సమావేశానికీ వీళ్ళను తీసుకొని రావడానికి, మళ్ళీ దింపిరావటానికి కంపెనీ కారులు వాడబడతాయి. సిటీలో కార్లున్నన్ని రోజులూ కారులన్నీ వాళ్ళ అధీనంలోనే ఉంటాయి.

ఒక్కొక్కసారి ఈ సమావేశాలు ఏ కాశ్మీరులోనో, ఏ సిమ్లాలోనో పెడతారు. ఎవరు? వాళ్ళే! అప్పుడు విమానం ఖర్చులు.

అంతవరకూ అయితే ఫర్వాలేదు. వీళ్ళ తరపు వాళ్ళను ఉద్యోగాలలో పెడతారు. ఖాళీలు లేకపోతే కొత్త పోస్టులను సృష్టిస్తారు. అవసరమైతే రూల్స్‌ను మారుస్తారు. రిజల్యూషన్స్ పాస్ చేస్తారు. వాళ్ళ టెరమ్ అయ్యే లోపల ఎంతమందికి జాబ్స్ ఇప్పించవచ్చు, ఎన్ని రకాలుగా వాడుకోవచ్చు—అదే వాళ్ళ ధ్యాస!

ఆ ఓచర్ల పొత్తి తీసుకొని మా ఎకౌంటెంట్ దగ్గర కెళ్ళాను. కాగితాల మీద కనిపించే రూల్స్ ప్రకారమయితే వాళ్ళకు సమావేశమైన రోజు మాత్రమే 'సిట్టింగ్ ఫీజు' ఇవ్వాలి. మరి ఇన్ని లొసుగులా? అదే ఆయనతో మొత్తుకున్నా.

"నాలుగు రోజులపాటు ఉద్యోగం చేసుకోవాలని లేదా, మురారీ!" అన్నా డాయన. అనుభవాలతో తల పండిన సీనియర్ ఆయన! వేడిరక్తం ఉరకలు తీసే పడుచు వయస్సులో ఉన్న జూనియర్‌ను నేను!

ఇంతలో ఫోను మ్రోగింది. 'నీకేనయ్యా!' అంటూ నా చేతి కిచ్చాడు.

మా ఎర్ర తాతయ్య చేశాడు. "ఏరా, వెధవా, ఈ మధ్య బొత్తిగా కనిపించటం లేదే! సాయంత్రం ఒకసారి మన ఇంటికి రా! వస్తూ ఆ రాజుగాడ్ని

కూడా తీసు కొనిరా!" అంటూ ఆర్డరేశాడు.

ఆ సాయంత్రం ఆఫీసు అయిన వెంటనే మా ఎర్రతాతయ్యగారింటికేసి బయలుదేరాను. మా తాతయ్య ఆర్డరుకెదురు లేదు. ఎన్ని పనులున్నా రమ్మంటే పోవల్సిందే!

దారిలో రాజుకోసం వాళ్ళ కాలేజీ హాస్టల్‌కి వెళ్ళాను. రాజు మా చిన్నాన్న కొడుకు. హాస్టల్లో ఉంటూ కాలేజీలో బి. కామ్, చదువుతున్నాడు.

ఆ కాలనీలో తాతయ్య వాళ్ళ ఇల్లు సెకడ్బందీగానే ఉంటుంది. ఇల్లు దగ్గరవుతుండగా రాజు, "ఎందు కన్నయ్యా తాతయ్య రమ్మంది?" అని అమాయకంగా అడిగేడు.

"ఇంటిదగ్గర మళ్ళీ ఏమన్నా గొడవలు జరిగాయేమో!"

మేం వెళ్ళేసరికి వరండాలో ఎర్రతాతయ్యా, బొర్ర తాతయ్యా కూర్చున్నారు.

ఒకాయన చుట్ట తాగుతున్నాడు. మరో ఆయన ఇంగ్లీషు పేపరు చూస్తున్నాడు.

ఎర్రతాతయ్య తమ్ముడు బొర్ర తాతయ్య.

ఆయన ఎర్రగా ఉంటాడు కాబట్టి ఎర్ర తాతయ్య అనీ, ఈయనకు బొర్ర ఉంటుంది కాబట్టి బొర్ర తాతయ్య అనీ పిలుస్తుంటాం.

నాకయితే వీళ్ళ పేర్లు సరిగ్గా తెలియవు కానీ, ఇద్దరూ ఏవో గవర్నమెంటు ఉద్యోగాలు చేసి రిటైరయ్యారు. నానా గడ్డీ కరిచో, నాలుగు రాళ్ళు వెనకేసుకునో ఈ బిల్డింగ్ కట్టించుకొన్నారు. విశ్రాంతిగా ఇలా చుట్టలు తాగుతూ, పేపర్లు చదువుతూ కాలక్షేపం చేస్తున్నారు.

"ఏరా, బొత్తిగా అవు పించటం మానేశావు" అని పలకరించాడు ఎర్ర తాతయ్య.

ఆయనకు చతురు జాస్తి.

కాసేపు అవీ, ఇవీ మాట్లాడాక తాతయ్య అసలు విషయంలోకి వచ్చాడు. మా వూళ్ళో మా నాన్న, చిన్నాన్నలు మళ్ళీ దేనికో తగాదా పడ్డారట. మా ఊరి కరణం విన్న బజార్లో కనిపించి ఈ విషయం చెప్పాడట.

"ఏదో చిన్నతగాదా అయుంటుందిలే తాతయ్యా!"

నాకు భయం—ఈ తాతయ్య చిన్న దాన్ని పెద్దది చేస్తాడు.

"నీ మొహం, చిన్న తగాదేంట్రా? ఆ కరణం మొగం కళ్ళారా చూశావా—ఇంకాస్తయితే తల కాయలు పగిలి ఉండేవట!"

ఆ మాటకు రాజు బిక్కమొగం వేశాడు.

"తాతయ్యను తీసుకెళ్ళి ఆ తగువేంటో చూడండి!" బొర్ర తాతయ్య సలహా ఇచ్చాడు.

నేను అయిష్టంగానే 'సరే!' అన్నాను. మా నాన్నలకు ఈ తాతయ్యలంటే గురుభక్తి. నెత్తిమీద పెట్టుకుంటారు. వీళ్ళు చెప్పేది వేదం. వీళ్ళు గీసింది లక్ష్మణగీత. వీళ్ళ మాట సుగ్రీవాజ్ఞ.

నేను ఎంతని చెప్పినా, చిన్న పొల్లు మాట్లాడినా చిలిపి పలుకులతో మా నాన్నకు చేరుతుంది. 'మా తాతయ్య అంతటోడు—' అంటూ మొదలు పెట్టి ఆయన గంటలేసి చిలుకలు తొక్కుతాడు. సర్లే నాకేంటి పెద్దగొడవ—అంటుకే 'సరే'

# చచ్చుగొడ్డు సమాజం

నేను కన్న ముగ్గురిని
నా చేతుల చంపివేసి
          ఆత్మహత్య చేతకాని
          అభాగ్యురాలిని నేను
నేను పడ్డ బావిలోన
నిలువెడు నీళ్ళైనా లేక
          చావలేక తండ్లాడితి
          లేవనెత్తె ఒక వ్యక్తి
తీసినోళ్ళు చంపుమంటె
"తీస్తరు నాపాన' మంటు
          ఒప్పచెప్పె పోలీసుకు
          ఒప్పుకుంటి నా తప్పును
బాధ తీరి పోవాలని
బావిలో పడి చావబోతి
          చచ్చువరకు జేలు శిక్ష
          ఇచ్చినాడు న్యాయమూర్తి
ఎవరికొరకు చత్తామని
చావలేక బతికితినో
          వారైతె పోయినారు
          వార్ని గూర్చి ఏడ్చుకుంటూ
చచ్చువరకు బతికాలట
చచ్చుగొడ్డు సమాజంలో!!
          చావుగూడ ధనవంతుల
          చేతులోని కీలుబొమ్మ
అవుషధాలు పెట్టేస్తె
అమడదూరం పోతది
          విషం మింగితే చాలు
          నిమిషంలో ఉరికొస్తది

**- వెల్దుర్తి మాణిక్యరావు**

అనక తప్పలేదు.

క్షణాల్లో ఈ వార్త ఇంట్లోకి ప్రాకిపోయింది. రంగాపురంకు మేం వెళ్తున్నామంటే మేం వస్తామని చిన్నవాళ్ళూ, పెద్దవాళ్ళూ తెగ సరదా పడిపోయారు. అందులో అవి వేసవి కాలపు సెలవులు.

ఎర్ర తాతయ్య, "వీళ్ళంతా వస్తామని సరదా పడుతున్నారు— టాక్సీ ఒకటి చూడరా, మురారీ. పైగా నేనా పెథవ బస్సుల్లో ప్రయాణం చెయ్యలేను!" అన్నాడు.

రానూ పోనూ టాక్సీ అంటే మాటలా? పైగా కాలం. ఎంత ఖర్చు? ఈ తాతయ్యల సంగతి నాకు బాగా తెలుసు. తాగే చుట్టల దగ్గర్నుంచి, చదివే పేపరు దగ్గర్నుంచి నేనే కొనాలి. ఏదైనా లోపం జరిగితే ముందు మా నాన్న వూరుకోడు. చెప్పిగ—"మీతాతయ్య అంతటోడు—" అని మొదలు పెట్టుతాడు.

* * *

మా టాక్సీని చూడగానే మావూళ్ళో జనమంతా మా ఇంటి ముందు మూగారు.

పొలానికి బయలుదేరుతున్న మా నాన్న వీళ్ళను చూసి ఆగిపోయాడు. అంతకుముందే పొలానికి వెళ్ళిన మా చిన్నాన్నకు కబురెళ్ళింది. ఆయన కంగారు పడుతూ వచ్చాడు. వీళ్ళిద్దర్ని భక్తి గౌరవాల ప్రదర్శించటంలో మా చిన్నాన్న మా నాన్నకు ఏమీ తీసిపోడు.

ముంజికాయల గెలలు తెగాయి. కొబ్బరి బోండాలు తెగాయి. పిల్లలు జున్ను పాలు తిన్నారు. మా పెదపాలేరు వూళ్ళోకి పరుగెత్తాడు. బొర్ర తాతయ్య ఉలవచారు ఉన్నారు. ఎప్పుడూ వాళ్ళ జీతగాడు కోడికోసం పరుగెత్తాడు. ఎవరో తెచ్చారు. మా నాన్న దొడ్లోనంతా మా చిన్న పిల్లల దుళ్ళగించాడు. ఇంట్లో వంటింట్లో ఒక వేరుసెనక్కాయల తంపట వెలసింది. తాజా కాఫీ పొడి, టీ పొట్లాలు, మసాలా దినుసులు, కిళ్ళీలు, నశ్యపొడి, సిగరెట్లు వగైరా వగైరా తీసుకుని రమ్మని మళ్ళీ మా రాజును బస్తీకి పరిగెత్తించారు.

అయినదానికీ కానిదానికీ పోట్లాడుకునే మా నాన్న, చిన్నాన్నలు ఈ బస్తీ మేనమామలకు మర్యాదలు జరిపించటంలో ఒకరి కొకరు పోటీలు పడ్డారు.

వీళ్ళకు మర్యాదలు జరిపించడానికి చేతిలో డబ్బు లేక అప్పు కోసం చిన్న మా నాన్న వెంగయ్య శెట్టి ఇంటికి పరిగెత్తాడు. పాత బాకీ అంటే శెట్టి ఇవ్వడని నిజంగానే నాకు నోరు ఆగిపోయింది. ఆ అంటులో ఎక్కువ మొత్తం ఈ తాతయ్యలు వచ్చినప్పుడు తీసుకున్నదే అని నిజం తెలిసినప్పుడు కోపం ముంచుకొచ్చింది.

నా అలిగి సమ్మానంలో రాజా ఎగిరి పడ్డాడు. శెట్టి ఇంటికి అప్పుకున్నాడు. చేతనిమ్మ బిరటి వచ్చారు.


అసలు పరిష్కరించటానికి ఆ రోజంతటికి కాని తాతయ్యలకు ముహూర్తం కుదరలేదు.

(పని ముందుగా అయిపోతే ముందుగానే పారిపోతామని భయమేమో.) తెల్లారి పెద్ద గిన్నెడు నెయ్యి పోసుకుని వేడి వేడి ఇడ్లీలు చెంబెడు జావా ఆరగించి, చిక్కటి కాఫీ సేవించి, ఒకాయన చుట్ట ముట్టించి, మరో ఆయన కిళ్ళీ బిగించి అప్పుడు తాపీగా "అసలు గొడవ ఏంట్రాపుల్లయ్యా" అంటూ పంచాయితీ ప్రారంభించారు.

గొడవకు కారణం చిన్నదే.

మా రెండిళ్ళ మధ్యలో ముంగిట్లో ఒక గది ఉంది. ఈ మధ్య దాన్ని మా చిన్నాన్న వాళ్ళకర్రి గిత్త తొక్కేసి పాడు చేసింది. సంతాలు పెట్టుకుని దాన్ని ఎవరూ లేపి నిలబెట్ట లేదు. పైగా దాన్ని గురించి రోజూ మగవాళ్ళ మధ్య, ఆడవాళ్ళ మధ్య, పిల్లల మధ్య, అఖరికి జీతగాళ్ళ మధ్యనగూడా ఇంకా ఆవేశాలూ కావేషాలూ రగులుతూనే ఉన్నాయి. పోటీగా సెగలూ పొగలూ ఎగజిమ్ముతూనే ఉన్నాయి.

ఇది ఇలా ఉంటే, మా నాయనమ్మ పనిలో సమస్యయి కూర్చుంది. ఆమెను ఒక నెల ఒక రింట్లో, మరోనెల ఇంకొకరింట్లో ఇలా వంతుల వారీగా తిండి పెట్టుతారు. ఇలా వంతులుగా పెట్టే




దాంట్లోకూడా తగాదాలు. . . ఇవికాక ఇక ఆ ఎల్లనీ పల్లి అనీ చిన్న చిన్న పిల్లల తగాదాలు అన్నీ తాతయ్యల ముందర విచారణకు పెట్టారు.

మా ఎర్ర తాతయ్య పకలిపస్తూ, ఇకిలిస్తూ, మధ్య మధ్యలో చతురాడుతూ, చిక్కు ప్రశ్న లేస్తూ, పూడే చోట వీడని మెలిక లేస్తూ, గోరు ఉపయోగించవలసిన చోట గొడ్డళ్ళకు పదును పెట్టుతూ, వాళ్ళకూ వీళ్ళకూ ఎక్కేస్తూ, ఉత్త బూటకపు లోంచి నిప్పులు రాజేస్తూ ఇరు పక్షాల వాదాన్నీ వోపిగ్గా విన్నాడు.

నేను అక్కడే కూర్చుని పేపరు చూస్తూ ఒక కంట నీళ్ళ తంతు అంతా కనిపెట్టుతున్నాను.

ఈ వ్యవహారాన్ని సజావుగా, శాశ్వతంగా పరిష్కరిద్దామనే సదుద్దేశం ఎర్ర తాతయ్య ధోరణిలో నాకెక్కడా కనిపించటం లేదు. ఇలా ఉంది ఆయన తగవు తీర్చే పద్ధతి. బొర్ర తాతయ్యకూడా అన్నగారి మాటకు తాన అంటే తందాన అంటూ వంత పలుకుతున్నాడు. వాళ్ళన్నదమ్ములు మాత్రం రామలక్ష్మణుల్లాగా, ఒక చెట్టు కాయల్లాగా వీడని పొత్తుతో సఖ్యంగా ఉంటారు. వీళ్ళనుకూడా తమ లాగే ఉండమని హితవు చెప్పారు. పొత్తు పొసగనీయరు. మెలికలూ, చిక్కులూ పెట్టుతున్నారు.

ఇది వీళ్ళ పెద్దరికం.

అసలు వీళ్ళకు ఈ పెద్దరికాన్ని ఇచ్చిన మా తాతను—మా నాన్న వాళ్ళ నాన్నను అనాలి. చదువుకున్న వారనీ, పట్నవాసులనీ వ్యవహార జ్ఞానం ఉన్న వాళ్ళనీ, ఉద్యోగస్తులనీ పాపం, ఆ చచ్చి నాయనకు వీళ్ళంటే గురి. ఏటి కొంకళ్ళు. కోటి కొంకళ్ళు లాగి, గుట్టుగాసాగే సంసారాన్ని రట్టు చేసే కొడుకుల సంగతి తెలిసి వీళ్ళ మంచి చెడ్డలూ చూసుకుంటూండమని పెద్దరికం వెలిగించమనీ అతనిపట్లున్న తాతయ్యలను కోరి ఉంటాడు.

మరి వీళ్ళ పెద్దరికం ఇలా ఉంది.

ఇంతలో అటు వచ్చిన రాజును చూచి బయటికి రమ్మని సైగ చేశాను.

వాళ్ళ సభ అలా సాగుతూనే ఉంది. మేమిద్దరం చెరువు కళింగం కేసి నడిచాం. . .

• • •

మేము ఇంటికి తిరిగి వచ్చేసరికి సభ ముగిసింది. ముంగిట్లో మళ్ళీ దడి వెలిసింది.

తాతయ్యలు నేతి గారెలతో, కోడి కూరలతో విందులు ఆరగిస్తున్నారు. మేము మీకు మేనమామలం, పెద్ద తలకాయలం అన్న హోదాతో, చనువుతో దర్జాగా అన్నీ అడిగి మరీ వేయించుకుంటున్నారు.

ఒక పక్క ఇలా భోజనాలు సాగుతూ ఉంటే మరో పక్క తాతయ్య వాళ్ళ రేపటి ప్రయాణానికి ఏర్పాట్లు ధాం ధూంగా జరుగుతున్నాయి.

తాతయ్యలిద్దరూ వెధవ లౌక్యాన్ని ప్రదర్శిస్తూ కొన్ని డైరెక్టుగానూ, మరి కొన్నిటిని ఇన్‌డైరెక్టుగానూ తమకు కావలసిన వస్తువుల జాబితా మెల్ల మెల్లగా బయట పెట్టుతున్నారు. నోట్లో మాట నోట్లో ఉండగానే మినుములూ, కందులూ, మిరపకాయలూ, వేరుసెనక్కాయలూ, గట్రా మూటలు తయారవుతున్నాయ్. వెన్న కాచిన నెయ్యి టిఫినుల్లో పోస్తున్నారు. జాడీలలో, హార్లిక్స్ సీసాల్లో రకరకాల పచ్చళ్ళు పెట్టుతున్నారు.

వీళ్ళను సంతుష్టి పరచటమే తమ జీవిత ధ్యేయమయినట్లు మా నాన్న, చిన్నాన్నలు పోటీలు పడుతూ అన్నింటినీ సమకూరుస్తున్నారు. . .

నేనూ, రాజూ—ఇద్దరం ఒకరి మొగం ఒకరు చూసుకున్నాం. వాడ్ని ధైర్యంగా ఉండమని హుషారు చేస్తూ కన్ను గిలిపాను. మా పెద్ద పాలేరును కేక పెట్టి పిలిచాను.

“ముందా దడి పీకి పారేయ్‌రా, వెంకటయ్యా” అన్నాను ఆవేశంగా.

నేను ఏమంటున్నానో అర్థంకాక వాడు కట్టకోడు లాగా నిలుచుండి పోయాడు. తాతయ్య ద్వయం ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయారు. నా కేకలకు నాన్నా వాళ్ళు కంగారుగా బయటికి వచ్చారు. ఇంటిల్లిపాదీ మూగారు.

ఎందుకు? ఏం జరిగింది? ఏమంటున్నారు? అసలేం జరిగింది... ఇలా తలా ఒక ప్రశ్న వేయసాగారు. నేనెవరికీ సమాధానం చెప్పలేదు. మళ్ళీ మా పాలేరును గద్దించాను దడి పడేయమని. వాడు వెర్రి మొగం వేసుకుని మా నాన్న వంక చూస్తూ ఉండి పోయాడు.

వీళ్ళతో లాభం లేదనుకుని, “అరేయ్ రాజా, రారా” అన్నాను.

వాడు హుషారుగా ముందుకు దూకాడు. మేము ఇద్దరమూ చెరోక పైపూ పట్టుకుని దడి ఫళంగా పైకి లేపేశాం—దాన్ని పెంట కుప్ప మీద పడేశాం.

ఎర్ర తాతయ్య కోపంగా “ఏంట్రా, మురారీ? అక్కడికి మేము పెట్టించే వాళ్ళం, మీరు తీసే వాళ్ళా? ఇక మా పెద్దరికం ఏంటి?” అన్నాడు.

ఈ రోజునుంచి దడులూ గిడులూ జాన్తానయ్—పాత పద్ధతులకు స్వస్తి. పాత పగలు ఇక నాస్తి అని అన్నాం. ఇక పంచాయతీలూ లేవు, మధ్యవర్తిత్వాలూ లేవు అన్నాం.

తాతయ్య వాళ్ళకు కోపం వచ్చింది. కస్సు బుస్సు లాడారు. పెద్ద రాద్ధాంతం చేశారు. మీ కొడుకులు ప్రయోజకు లయ్యారు. గొప్పోళ్ళయి పోయారు. పద్ధతులు మార్చేస్తారంట. ఇక మాతో పనేంటి? మా పెద్దరికం ఏంటి? చచ్చి ఏ లోకాన ఉన్నాడో ఆ పెద్దాయన చెప్పాడని కానీ, మధ్యలో మా కేంటీ వెధవ పీడా. మాటి మాటికి ఇంత దూరం ఈ వెధవ పల్లెటూళ్ళు రావటానికి, మీ తగవులు తీర్చటానికి మా కేం గరుడు పట్టిందా—అంటూ చేతులు కడిగేసుకుని, మూటలు ముడిచేసుకుని అప్పటి కప్పుడు ప్రయాణమై పోయారు.

మా నాన్న వాళ్ళు వాళ్ళిద్దర్నీ బతిమాలారు. చేతులు పట్టుకున్నారు. మా మీద ఇంత ఎత్తున లేచారు. నోటికి వచ్చినట్లు తిట్టారు.

ఎంత ఎత్తున లేచినా, ఎన్ని తిట్టినా, ఎన్ని అన్నా మేము ఇద్దరం చలించలేదు. గట్టిగా నిలబడ్డాం. మా కుటుంబ శ్రేయస్సు కోసం కన్న వాళ్ళనే ఎదిరించాం. . .

టాక్సీలో దర్జాగా వచ్చిన తాతయ్యలూ, వాళ్ళ మందీ మార్బలమూ కాళ్ళీడ్చుకుంటూ బస్సు ఆగే చోటకు పోయారు. అంతకు ముందు సర్దిన మూటలూ, నేతి టిఫిన్లూ, జాడీలు గట్రా మా పాలేరు కొడుకు పోలాయిగాడు నేను చేసిన సైగ నందుకుని చిటికెలో మాయం చేసేశాడు.

* * *

మాతోపాటు మా నాయనమ్మనుకూడా పట్నానికి తీసుకెళ్ళి, ఆమె చేత వండించుకుని మేము ఇద్దరం కమ్మగా తింటున్నాం.

ఆ తరవాత ఎర్ర తాతయ్య బజార్లో కనిపించి నప్పుడు నేను మాట్లాడించబోతే మొగం తిప్పుకుని కోపంగా వెళ్ళిపోయాడు.

* * *

మళ్ళీ ఆఫీసులో వోచర్లు ఆడిట్ చేస్తున్నాను. మా బోర్డు సమావేశాలఖర్చులు—సిగరెట్టు టిన్నులూ డ్రింకులూ, త్రీ స్టార్ హోటలులో ఎక్చువల్ ఎక్స్‌పెండిచర్ ఓచర్లూ, ఎయిర్ టిక్కెట్లూ. . .

నేను ఆలోచనలో పడ్డాను. బయటి వాళ్ళ ప్రమేయంలేకుండా ఎవరిల్లు వాళ్ళు చక్క పెట్టుకో కూడదా? ★